క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీ: రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తండ్రి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం విదితమే. కాగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ గురువారం చందర్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. మల్లయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు బొంతల రాజేశ్, మహంకాళిస్వామి, ఎండీ.ముస్తఫా, నాయకులు గట్ల రమేశ్, కొటం సతీశ్ పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ..

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఏరియాలోని పలువురిని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ గురువారం పరామర్శించారు. మేడిపల్లి సెంటర్‌లో నివసిస్తున్న సుద్దాల రమేశ్, రామారావు, లక్ష్మి, నర్రాశాలపల్లెకు చెందిన ఈదునూరి సంపూర్ణ ఇటీవల మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

లక్ష్యసాధనకు పాటుపడాలి



డైరీ ఆవిష్కరిస్తున్న ఎస్ఈ విజేందర్

రామగుండం: రాబోయే ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ ఉత్పత్తిలో లక్ష్యసాధనకు ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని బీ–థర్మల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజేందర్ అన్నారు. గురువారం తన ఛాంబర్‌లో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్–1535 రూపొందించిన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ వినియోగ డిమాండ్ అధికంగా ఉండటంతో కేంద్రం ట్రిప్ కాకుండా జాగ్రత్త తీసుకుంటూ చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి లక్ష్యసాధనకు పాటుపడాలని కోరారు. యూనియన్ రీజినల్ కార్యదర్శి ఆముల కిరణ్‌కుమార్, మొయిజ్‌పాషా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ తఖీ, ప్రధాన కార్యదర్శి గుర్రం కుమారస్వామి, అబ్దుల్ నజ్మీ, సమియొద్దీన్, యూనుసొద్దీన్, రాయలింగు, మజీద్, సత్తయ్య, రవిచందర్, స్వామి, డీఈలు బాలకృష్ణన్, సూర్యనారాయణరెడ్డి, ఏఏఈ బీరెల్లి అనిత తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం

ఎలిగేడు: మండలంలోని ర్యాకల్‌దేవుపల్లి, రాములపల్లి గ్రామాల్లో బస్తీ సంపర్క్ అభ్యాన్‌లో భాగంగా గురువారం బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీకాలనీలో ఇంటింటా తిరుగుతూ కేంద్రప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన అభివృద్ధి, పేదల కోసం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. బీజేపీ నాయకులు ఆసంపల్లి రవీందర్, బొజ్జ రాజయ్యయాదవ్, భాస్కర్‌రెడ్డి, కామర లక్ష్మన్ పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ బాధ్యతలు స్వీకరణ

సుల్తానాబాద్: మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్‌లో కౌన్సిలర్లు, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సహకారంతో నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ మేనేజర్ అలీమొద్దీన్, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

సుల్తానాబాద్: ఉమ్మడి జిల్లా గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనానికి గౌడ కులస్తులందరూ తరలిరావాలని రిటైర్డ్ జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రాజన్నగౌడ్ కోరారు. ఈ సందర్భంగా పలువురు రిటైర్డ్ అధికారులు, గౌడ సంఘం నాయకులతో మండల కేంద్రంలో ఆయన గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. కరీంనగర్ మండలం బొమ్మకల్ వి.కన్వెన్షన్ హాల్లో 10వ తేదీన నిర్వహించే సమావేశానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హాజరుకానున్నారని, అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. గర్రెపల్లి మాజీ సర్పంచ్ పడాల అజయ్‌గౌడ్, పలువురు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



గోదావరిఖనిటౌన్: స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలలో స్కావెంజర్‌గా విధులు నిర్వహించిన ఆర్.లక్ష్మి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా గురువారం సన్మానించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమాకాంత్, అధ్యాపకులు సురేశ్‌కుమార్, రవి, రమేశ్‌రెడ్డి, ప్రసాద్, అజయ్‌కుమార్, అజీజ్, సల్మా, సుల్తానా పాల్గొన్నారు.

కులవివక్ష చూపితే కఠిన చర్యలు

• గ్రామాల్లో పౌరహక్కుల దినోత్సవం

జ్యోతినగర్: కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లి గ్రామంలోని రైతువేదికలో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్, రామగుండం మండల తహసీల్దార్ కుమారస్వామి పాల్గొని మాట్లాడారు. కుల వివక్షత చూపించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం, మండల వ్యవసాయాధికారి ప్రకాశ్, సాంఘిక సంక్షేమశాఖ ప్రతినిధి సాయికుమార్, ఆర్ఐ వినోద్, అంబేడ్కర్ సంఘం నాయకులు మైస రాజేశ్, కాంపెల్లి సతీశ్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎండీ రహీం, మల్లేశ్ పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఆర్ఐ శైలజ, జూలపల్లి ఏఎస్సై భాస్కర్‌రావు, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారి శ్రీనివాస్, అంబేడ్కర్ సంఘం గ్రామ అధ్యక్షుడు జల్లి రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ కుమారస్వామి

జూలపల్లి: గ్రామాల్లో అంటరానితనం, మూఢనమ్మకాలను ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దారు బషీరొద్దీన్ హెచ్చరించారు. గురువారం మండలంలోని కుమ్మరికుంటలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీడీవో పద్మజ, వైద్యాధికారి సంపత్‌రెడ్డి, ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశం పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని భూపతిపూర్‌లో గురువారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్, ఏఎస్సై మజార్, గిర్దావర్ స్వాతి పాల్గొన్నారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పొట్యాలలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. అంతర్గాం తహసీల్దార్ పనగంటి రామ్మోహన్‌రావు, ఎంపీవో మోతె సమ్మిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళి, ఆర్ఐ శ్రీధర్, ఏఎస్సై నాయుడు, అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు ఇండిబిల్లి రవీందర్, కార్యదర్శి గంగలక్ష్మి, ఎంపీటీసీ మస్కం శ్రీనివాస్ ఉన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం రెవెన్యూ అధికారులు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఉప్పర్లకేసరం (వకీల్‌పల్లి)లో రామగిరి ఆర్ఐ రాజబాబు అవగాహన కల్పించారు.

పాలకుర్తి: మండలంలోని గుడిపల్లిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి, మండల పశువైద్యాధికారి ఖాన్, సీనియర్ అసిస్టెంట్ పోషం పాల్గొన్నారు.

ధర్మారం: మండలంలోని పత్తిపాకలో తహసీల్దార్ రజిత అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవం జరిగింది. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ అధికారి సంపత్, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బద్దం నర్సింహరెడ్డి, మాదిగ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సుంచు మల్లేశం, జిల్లా కోకన్వీనర్ పేర్క బానేష్, సంఘం గౌరవ అధ్యక్షుడు అంజయ్య పాల్గొన్నారు.

మగ్గంవర్క్‌తో మహిళల ఆర్థికాభివృద్ధి

కోల్‌సిటీ: మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ మహిళలకు, యువతులకు మహాదావకాశంగా నిలుస్తోందని, శిక్షణతో ఉపాధి పొందడంతోపాటు ఆర్థికాభివృద్ధి సాధించాలని నాబార్డు ఏజీఎం జయప్రకాశ్ పిలుపునిచ్చారు. గోదావరిఖనిలోని చంద్రబాబునాయుడు కాలనీలో నాబార్డు సౌజన్యంతో స్పందన సేవా సొసైటీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు శోభారాణి ఆధ్వర్యంలో 15 రోజులుగా ఎస్‌హెచ్‌జీ మహిళలకు మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ ఇప్పించారు. శిక్షణలో ప్రతిరోజూ ఒకపూట ఉచిత భోజనం అందించడంతోపాటు రూ.750 స్టయిఫండ్, సర్టిఫికెట్లు అందజేశారు. గురువారం శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు స్టయిఫండ్‌తోపాటు సర్టిఫికెట్లను నాబార్డు ఏజీఎం జయప్రకాశ్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ గోపికృష్ణ చేతుల మీదుగా శోభారాణి అందజేశారు. కోఆర్డినేటర్ గౌతమి, ట్రైనర్స్ రజియా బేగం, భవాని పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రతినిధులు

సమ్మక్క జాతర హుండీ ఆదాయం లెక్కింపు

పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామ సమ్మక్క–సారలమ్మ జాతర హుండీల లెక్కింపు గురువారం నిర్వహించారు. జాతర నిర్వహణ సందర్భంగా ఈసాలతక్కళ్లపల్లి, రామారావుపల్లి, కొత్తపల్లి గ్రామాల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో హుండీ లెక్కింపు వాయిదాపడింది. దేవాదాయ శాఖ అధికారి కాంతారెడ్డి, బసంత్‌నగర్ ఎస్సై స్వామి చొరవతో వివాదం సద్దుమణిగింది. దీంతో జాతర ప్రాంగణంలో హుండీల లెక్కింపు చేపట్టగా మొత్తం రూ.2,69,740 ఆదాయం వచ్చింది. వీటిలో జాతర అభివృద్ధి కోసం రూ.1.20లక్షలు ఖర్చు చేసేందుకు మూడు గ్రామాల పెద్దమనుషుల సమక్షంలో నిర్ణయం తీసుకుని సంబంధిత నగదును మూడు గ్రామాలకు సంబంధించిన సంయుక్త బ్యాంక్ ఖాతాలో డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారి కాంతారెడ్డి, పాలకుర్తి వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, కొత్తపల్లి, రామారావుపల్లి గ్రామాల మాజీ సర్పంచులు మల్లెత్తుల శ్రీనివాస్, శేర్ల లక్ష్మీపతి, జాతర నిర్వహణ కమిటీ సభ్యులు గాలిపెల్లి శ్రీనివాస్, నెరువట్ల రాయపోశం, ముల్కల కొమురయ్య, రెడపాక రాములు పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం ముగిశాయి. చివరిరోజు మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని ర్యాలీగా తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సతీమణి మనాలి ఠాకూర్ పాల్గొని అమ్మవారికి బోనంతో పాటు మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పాత భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచులు కట్టికోల వేణుగోపాలరావు, పర్శవేని శ్రీనివాస్, ముక్కెర శ్రీనివాస్, నాయకులు పాత రవీందర్, అట్ల శ్రీనివాస్, తిరుమలాచారి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మాజీ సర్పంచులకు సన్మానం



బోనంతో ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్

బసంత్‌నగర్, జీడీనగర్, ఈసాలతక్కళ్లపల్లి గ్రామాల మాజీ సర్పంచులు కట్టికోల వేణుగోపాలరావు, సూర సమ్మయ్య, ముక్కెర శ్రీనివాస్‌తో పాటు విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించిన పంబాల పూజారులను గురువారం స్థానిక బీఆర్ఎస్ నాయకుడు ముత్యం లక్ష్మణ్ ఆధ్వర్యంలో సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం కార్పొరేషన్ భరత్‌నగర్, పీకే రామయ్యకాలనీ, ఆటోనగర్‌లో విద్యుత్ లైన్ ఆధునీకరణ పనులు చేపట్టనున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం 11:00 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. వినియోగదారులు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

పోలీసుల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ

పాలకుర్తి: బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల టోల్ ప్లాజా, ధర్మారం క్రాస్‌రోడ్డు సమీపంలోని గణపతి స్టోన్‌క్రషర్స్ ఎదురుగా గల ఫోర్‌లైన్ రహదారిపై పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ.సత్యనారాయణ, బసంత్‌నగర్ ఎస్సై స్వామి ఆధ్వర్యంలో వేర్వేరుగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించి పూర్తిస్థాయిలో పత్రాలు లేని, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించని వాహనదారులు, రాంగు రూట్లో ప్రయాణిస్తున్న వారిని గుర్తించి జరిమానా విధించారు. బసంత్‌నగర్ రెండో ఎస్సై శివాణిరెడ్డి, సిబ్బంది కొమురయ్య, మహేందర్, రవీందర్, శివకుమార్, సురేశ్, రమేశ్ పాల్గొన్నారు.

ఓదెల మండలంలో..

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శానగొండ, ఓదెల, మడక గ్రామాల్లో ఎస్సై జి.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల మీదుగా సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్ వైపు వెళ్లే అనుమతి లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

సమస్యలపై సానుకూల స్పందన

సుల్తానాబాద్: గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పంచాయతీరాజ్ కమిషనర్ అనిత రామచంద్రన్‌ను పంచాయతీ ఉద్యోగులు కలిసి విన్నవించారు. బుధవారం హైదరాబాద్‌లో కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని విన్నవించగా సానుకూలంగా స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని తెలిపారని పంచాయతీ ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కుక్క కుమార్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో ఏర్పాటు చేసిన గన్నర్స్ స్పోర్ట్స్ అండ్ డిఫెన్స్ అకాడమీలో యువతకు ఇచ్చే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కుమార్ సూచించారు.

టీబీరహిత జిల్లాగా మారుద్దాం

సుల్తానాబాద్: టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలు యువత సహకరించాలని జిల్లా టీబీ సూపర్‌వైజర్ సురేందర్ కోరారు. గురువారం మండల కేంద్రంలో జ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాలలో విద్యార్థులకు టీబీ లక్షణాలను వివరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంథని: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంథని కేడీసీసీ బ్యాంకు మేనేజర్ దుమ్మని లక్ష్మణ్ అన్నారు. గురువారం మంథని మండలం ఖానాపూర్ గ్రామంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత, ఘర్ ఘర్ కేసీసీ అభియాన్ అవగాహన సదస్సులో మాట్లాడారు. నాయకులు సేమంతుల ఓదెలు, దొరగొర్ల శ్రీనివాస్, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఆధార్ కేంద్రం ప్రారంభం

సుల్తానాబాద్: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆధార్ కేంద్రం ఏర్పాట్లను తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని జిల్లా ఆధార్ కేంద్రంతో అనుసంధానం పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం గుంటూరుపల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం మగువ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రామగుండం మగువ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీవాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి

కోల్‌సిటీ: గోదావరిఖని వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా ఇంద్రసేనారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, గంజాయి లాంటి మత్తు పదార్థాలు అమ్మినా, సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని కోరారు. దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా అందరూ కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

టూటౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరణ

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ సీఐగా జి.రవీందర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందున్న సీఐ ప్రసాద్‌రావు లీగల్ సెల్ రామగుండం హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ కాగా మల్టీజోన్–1 హైదరాబాద్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రవీందర్‌ను గోదావరిఖని టూటౌన్ సీఐగా బదిలీ చేశారు.

రామగుండం సీఐగా..

జ్యోతినగర్: రామగుండం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.అజయ్‌బాబు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గురువారం రామగుండం సర్కిల్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరిన సీఐకి పలువురు స్వాగతం పలికారు.

మహిళా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జ్యోతి

పెద్దపల్లిరూరల్: మహిళా కార్మికులు పనిచేసే ప్రదేశాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) మహిళా కార్మికుల జిల్లా కన్వీనర్ జ్యోతి కోరారు. పెద్దపల్లిలో గురువారం మహిళా కార్మికుల జిల్లా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళలు ఎదుర్కొనే సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సబ్ కమిటీలు ఏర్పాటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కన్వీనర్‌గా నాగమణి, కోకన్వీనర్‌గా మరియ, సభ్యులుగా సమ్మక్క, సునీత, సుశీల, రమాదేవి, లక్ష్మి, లత, చుక్కమ్మను ఎన్నుకున్నట్లు చెప్పారు. మార్చి 8న మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ నీళ్లు

ఓదెల: కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, ఓదెల మండలాల ఆయకట్టు చివరి సాగుకోసం ఎస్సారెస్పీ నీరందుతాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఓదెలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఆదేశాల మేరకు వెదురుగట్టు టన్నెల్ నుంచి ఎస్సారెస్పీ కాలువ నీరు వదిలినట్లు ఆయన తెలిపారు. వరిపొలాలు, పత్తిచేన్లు, మొక్కజొన్న పంటలు ఎండిపోకుండా కాలువ నీరందుతాయన్నారు. పొత్కపల్లి సొసైటీ చైర్మన్, డైరెక్టర్ బొంగోని శ్రీనివాస్‌గౌడ్, కాల్వశ్రీరాంపూర్ మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, నాయకులు వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి చేయూత

గోదావరిఖనిటౌన్: స్థానిక గాంధీనగర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ గాలి సంతోష్(సతీశ్) ఇటీవల క్యాన్సర్ వ్యాధితో మృతి చెందాడు. కాగా గోదావరిఖని ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.33,030 నగదును గురువారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బైరం సతీశ్, రెడ్డి భాస్కర్, శనిగరపు మల్లేశ్, గూడూరు శ్యాంసుందర్, దుస్స మహేశ్, తోగటి శ్రీధర్, గూడెల్లి శ్రీనివాస్, రామగిరి శ్రీనివాస్, గడమల్ల రఘు, మోర విక్రమ్, గూడూరు పవన్‌కుమార్ పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీవాణి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాన్ని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా నోడల్ అధికారి కల్పన సందర్శించారు. మొత్తం రెండు సెంటర్లలో 231 మంది విద్యార్థులకు గాను 21 మంది హాజరు కాలేదని సీఎస్‌లు మోరాజ్, అజ్మ తెలిపారు.

జూలపల్లి: కేజీబీవీ, ఆదర్శతో పాటు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన సెకండియర్ విద్యార్థులు 311 మందికి 309 మంది హాజరయ్యారు.

ఇద్దరు గైర్హాజరు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన ఇంటర్ ద్వితీయ పరీక్షలకు 62 మంది గాను 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు సీఎస్ తెలిపారు.



సుల్తానాబాద్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయ సముదాయంలో ఉన్న శ్రీఅయ్యప్ప ఆలయ 29వ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం నిర్వహించారు. పట్టణానికి చెందిన పాత రాజయ్య, పాత శ్రీనివాస్, పాత ప్రసాద్, పాత చంద్రశేఖర్ కుటుంబాలు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖర్‌శర్మ, గురుస్వాములు గోపగాని రాములుగౌడ్, కట్కూరి ఆత్మలింగం, పిల్లి శివయ్య, తాటిపెల్లి శివప్రసాద్, ఎనగంటి శ్రీనివాస్‌రావు, మద్దికుంట శంకర్, గుంటి దేవేందర్ ఉన్నారు.



ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం

రేపటి వరకు కుందనపల్లి రైల్వేగేట్ బంద్

రామగుండం: రామగుండం–రాఘవపూర్ రైల్వేస్టేషన్ల మధ్య ఉన్న కుందనపల్లి రైల్వేగేటు (ఎల్‌సీ–49) శనివారం సాయంత్రం వరకు మూసివేసి ఉంచనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టనుండడంతో రైల్వేగేటు మూసి ఉంచనున్నట్లు తెలిపారు. అయితే కుందనపల్లి రైల్వేగేటు మూసివేస్తే నాలుగు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనున్నారు. బసంత్‌నగర్, పెద్దపల్లి, కరీంనగర్ నుంచి రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు సైతం రామగుండం మీదుగా రైల్వేస్టేషన్‌కు ఐదు కిలోమీటర్ల దూరం తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. రైల్వే అధికారులు ప్రత్యామ్నాయ రహదారి సౌకర్యం లేకుండా కుందనపల్లి రైల్వేగేటు మూసివేసి ఉంచడంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



మూసివేసి ఉన్న కుందనపల్లి రైల్వేగేట్

సౌర విద్యుత్ కేంద్రం పనులు పూర్తి చేయాలి

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలోని ఓసీపీ–1 ఉపరితల గని డంపుపై నూతనంగా ఏర్పాటు చేస్తున్న 22 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రం అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఈఅండ్ఎం డైరెక్టర్ డి.సత్యనారాయణరావు అన్నారు. గురువారం ఓసీపీ–1 ఉపరితల గని డంపుపై ఏర్పాటు చేస్తున్న సౌర విద్యుత్ కేంద్రం పనులను పరిశీలించారు. అనంతరం జీఎం కార్యాలయంలో జీఎం ఎన్.సుధాకర్‌రావు, సోలార్ జీఎం జానకీరామ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏరియా ఇంజనీర్ పీ.ఎలీషా, ప్రాజెక్టు అధికారి ఎన్.రాధాకృష్ణ, వర్క్‌షాపు డీజీఎం ఎర్రన్న, ప్రాజెక్టు ఇంజనీర్ ఆర్.శ్రీనివాస్, మేనేజర్ ఉదయ్ హరిజన్ పాల్గొన్నారు.



సమావేశంలో ఈఅండ్ఎం సత్యనారాయణరావు

డిప్లొమా విద్యార్థుల ఫేర్‌వెల్ డే

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీ డిప్లొమా విద్యార్థులు గురువారం వైబ్రేన్స్ ద స్పిరిట్ ఆఫ్ ఎంటీసీఈ పేరిట వార్షిక వేడుకలు జరుపుకున్నారు. ఈ ఏడాది ఫస్టియర్ సెమిస్టర్‌లో కాలేజీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏవో పవన్‌కుమార్ అన్నారు. ఆ విద్యార్థుల తల్లిదండ్రులను కూడా సత్కరించారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతి అందజేశారు. విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరింపజేశాయి. హెచ్‌వోడీ ఇజాజ్‌ఖాన్, అనిల్, అర్షియా, భరత్, శ్రీధర్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.



వేడుకల్లో విద్యార్థులు, అధ్యాపకులు

క్రైం న్యూస్

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పరిధి యైటింక్లయిన్‌కాలనీకి చెందిన కట్కూరి శ్రీనివాస్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై గురువారం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కట్కూరి శ్రీనివాస్ కుమార్తె, అల్లుడికి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయపై మాట్లాడుకుందామని శ్రీవేంకటేశ్వర దేవాలయం సమీపంలో అల్లుడు విజేందర్ రెడ్డితో పాటు అతని బంధువులు శ్రీనివాస్‌ను అతని భార్యను పిలిచారు. అయితే మాట్లాడే సమయంలోనే దాడికి పాల్పడి గాయపరిచినట్లు బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బండారి రవిగౌడ్‌పై దాడికి పాల్పడిన కాంట్రాక్టర్ బస్వరాజు గంగరాజుపై గోదావరిఖని టూటౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై ఫరీద్ తెలిపిన వివరాల ప్రకారం టూటౌన్ పరిధిలోని గోదావరి నది ఒడ్డున ఇటీవల నిర్వహించిన సమ్మక్క జాతరకు సంబంధించిన పారిశుధ్య పనుల నిర్వహణకు మున్సిపల్ కాంట్రాక్టర్ గంగరాజు లేబర్స్‌ను సరఫరా చేయాలి. ఫిబ్రవరి 21న రాత్రి షిఫ్టులో జాతర ప్రాంగణంలో పారిశుధ్య పనులు జరగనందున చెత్తా చెదారం బాగా పేరుకు పోయింది. చెత్త తొలగించకపోడంతో సంబంధిత కాంట్రాక్టర్ రవిని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బండారి రవి ప్రశ్నించారు. చెత్త తొలగించాల్సిందిగా చెప్పడంతో అదే రోజు రాత్రి విధులు నిర్వహిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై కాంట్రాక్టర్ దాడి చేశాడని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బోర్‌వెల్ మోటార్ చోరీ

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారేడుపల్లి గ్రామంలోని వైకుంఠధామంలో ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌కు బిగించిన విద్యుత్ మోటార్‌ను బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. బోర్‌వెల్ మోటారుకు ఉన్న పైపు, విద్యుత్ వైరును కట్‌చేసి మోటార్‌ను మాత్రమే దుండగులు ఎత్తుకెళ్లారు. సంబంధిత విషయమై స్థానికులు బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పీడీఎస్ రైస్ పట్టివేత

కోల్‌సిటీ: గోదావరిఖనిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ రైస్‌ను గురువారం పట్టుకున్నారు. పీడీఎస్ రైస్‌ను తక్కువ ధరలకు కొనుగోలు చేసి మార్కండేయకాలనీలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచారు. కాగా రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో టాస్క్ ఫోర్సు పోలీసులు తనిఖీ చేసి 5క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను స్వాధీనం చేసుకొని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.